ఎత్తుపల్లాలు

మదకుంభి కుంభస్థలాన్ని తప్ప అన్యమొల్లని కేసరి-చిట్లిన ఎముకలు దొరకని చిల్లర మృగాలు, ఒకే కాంతారంలో జీవయాత్ర సాగిస్తున్నాయి. శాఖోపశాఖలై విస్తరిల్లిన మహా వృక్షాలు - ఆరడుగులకన్నా మించి పెరుగని అలతిచెట్లు, అంబర చుంబితోత్సాహులైన అవనీధరాలు - కొండల ఆకారాన్ని మాత్రం కలిగిన చట్టుబండలు - ఇవన్నీ ప్రకృతిలో గోచరించే వింతలే.

భిన్నత్వం, అంతరం, అసమానత్వం ప్రకృతిధర్మాలు. ప్రకృతిలోని భిన్నత్వాన్ని మించిన అంతరం మానవుల్లో సైతం వుంది. మన సత్త్వాల్లో - వ్యక్తిత్వాల్లో, రూపాల్లో - వయస్సుల్లో, ఉనికిలో - జీవన మార్గాల్లో కొట్టవచ్చినట్లు కనపడుతుంది ఈ భేదం.

అయితే ఏం? భారతదేశ, సాంఘిక, రాజకీయ, ఆర్థిక విధానాలలోవలె, భిన్నత్వంలో ఏకత్వం పొసగుతూ

ఉంటుంది. ఈ అనేకత్వంలోని ఏకత్వం శాశ్వతమా అంటే సందేహించకుండా "అవునని" సమాధానం చెప్పలేం.

రోడ్డుమీద రిక్షా ఆగింది.

రిక్షాలోని పెద్దమనిషి క్రిందికి దిగి జేబులో పర్సు తీశాడు. రోడ్డుకు ఈ వైపున ఉన్న గుడిసె బయటి యిసుక దిబ్బమీద పడుకున్న ఆరేళ్ళ కుర్రవాడు రిక్షాను చూసి గబ గబా పరిగెత్తుకుంటూ వచ్చాడు. రిక్షా గంటను గణగణ లాడించాడు. ఏదో అవ్యక్తానందంతో చిందులు వేయసాగేడు. అతని మొహంలో సంతోషం విరిసింది.

"అరేయ్, పవిత్రా వెధవ రొద" అంటూ డబ్బులు రిక్షావాని చేతిలో పడేసి ఎదురుగా ఉన్న భవంతిలోకి సాగి పోయాడు పెద్దమనిషి.

ఆ కుర్రవాడు గంట కొట్టటం మానలేదు రిక్షా అతను చిల్లర జేబులో వేసుకుని వాడి వైపు చూశాడు సంబరంతో పొంగిపోతున్నాడతను. రిక్షావాలా సన్నగా నవ్వుకున్నాడు. పరిసరాల్ని పరికించాడు.

గుడిసె ప్రక్కగా నేలమట్టంవరకూ లేచిన పెద్ద భవంతి తాలూకు గోడలు, దాని ప్రక్కనే భవన నిర్మాణానికి అవసరమైన సామగ్రీ ఉన్నాయి. ఆ భవనం తయారు కాగానే యీ గుడిసెకి అక్కడ స్థానం ఉండదు. మరో చోట వెలుస్తుంది. అంతేకాని, శాశ్వతంగా ఆ గుడిసె లేకుండా పోవడానికి అవకాశం లేదు.

రిక్షావాలా రిక్షాను వెనక్కు త్రిప్పి ముందుకుసాగాడు. కుర్రాడు రిక్షా వెనుకభాగాన్ని పుచ్చుకుని కొంతదూరం

పరుగెత్తి అలసిపోయి మధ్యలో ఆగిపోయాడు. రిక్షా సినిమా హాలు ముందుకొచ్చి ఆగింది. ఆట వదలటానికి యింకా వ్యవధి వుండటంవలనకాబోలు, రిక్షావాలాలంతా బండ్లలో నడుములు వాల్చి పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు.

"ఏరా, రాఘవులూ, యేమాత్రం తోలావ్, యియ్యాల?" అప్పుడే వచ్చిన రిక్షావాలాను మరో అతను ప్రశ్నించాడు.

రాఘవులు అన్యమనస్కంగా ఉన్నాడు. అతనికి సమాధానం చెప్పకుండా రిక్షా సీటును ఎత్తి లోపలి అరలో నుంచీ పుస్తకాన్నొకదాన్ని బయటికి తీసుకున్నాడు. రిక్షాలో కూర్చుని దాన్ని చూడసాగేడు.

"ఏందిరా సీ అది. పిలుస్తుంటే పలుకవేం? నిన్నేరా రాఘవులూ" మళ్ళీ హెచ్చరించాడతను.

"ఏందిరా ఎధవగోల. ఆడెంత సంపాయిస్తే నీకేరా, రంగా" యింకొకతను విసుక్కున్నాడు.

రంగడు అతనివైపు తీక్షణంగా చూసి, "పానకంలో పుడకలా మద్దెలో నీ కెందుకు?" అన్నాడు కోపంగా. రంగణ్ణి విసుక్కున్నా తను ఏదో గొణుక్కుంటూ రిక్షా ముందుకు లాక్కుని వెళ్ళిపోయాడు.

"ఏరా రాఘవులూ, అంత యిదిగా చూస్తున్నావే ఏంవన్నా బొమ్మా!" అని "ఇహిహి" అంటూ నవ్వాడు రంగడు.

రాఘవులు పుస్తకాన్ని ప్రక్కకు తీసి రంగణ్ణి చూశాడు. రంగడి వెకిలి నవ్వుకు అతనికి ఒళ్ళు మండింది

"వెధవ చేష్టలూ నువ్వూను... నేనెంత సంపాయిస్తే నీ కెందుకురా? ఎప్పుడూ ఎవడో ఓడినెత్తిన చెయి పెట్టటానికి ప్లాన్ వేస్తూనే ఉంటావ్."

రంగడు మొహం చిన్నపుచ్చుకుని, ప్రాధేయపడ్డాడు. "అదిగాదు రాఘవులూ, మా అయ్యకు వంట్లో బాగా లేదురా! ఇయ్యాల రూపాయన్నా మిగల్లేదు. మందెత్తుకు పోవాల్రా. ఓ రెండు రూపాయలుంటే యియ్యి. రేపు చూసుకుందాం. అమ్మా అయ్యా లేనివాడివి, నువ్వుకాక యింకోడెవడు అప్పు పెడతాడురా నాకు... నువ్వే రచ్చించాలి."

రాఘవులు సందేహంగా రంగణ్ణి చూశాడు. ఇలాంటి అబద్ధాలాడటంలో రంగడిది పెద్ద తెలివి! కాని, అయ్య మాటనేసరికి, రాఘవులు ఆలోచన తన తండ్రిమీదకు మరలింది. అతని కళ్ళలో నీళ్ళు తిరిగినై.

అది గమనించి రంగడు. "ఏందిరా ఏడుస్తుండావ్?" అన్నాడు.

రాఘవులు కళ్ళు తుడుచుకుని చెప్పాడు, "రేపణ్ణుంచి మా నాన్నా వస్తాడురా. బాడుగడబ్బులు సరిపోతవో లేదోనని భయంగా ఉంది. సర్లే. రేపటిసంగతి రేపు చూసుకుందాం. ఇవిగో డబ్బులు. రేపు తప్పకుండా యిచ్చేయ్." అంటూ జేబులో నుంచీ రెండు రూపాయ నోట్లు తీసి రంగడిచేతిలో పెట్టాడు. రంగడి కళ్ళు సంతృప్తితో మిలమిల లాడినై. హుషారుగా యీల వేసుకుంటూ రిక్షా తీసుకుని వెళ్ళిపోయాడు.

రాఘవులు మళ్ళీ పుస్తకం తీసి చూశాడు. అదొక చిన్న నోట్ బుక్. దానినిండా జమా ఖర్చుల అంకెలు చిందర వందరగా వేసివున్నై. పుస్తకం మధ్యపేజీలో పెద్ద అంకెల్లో రేపటి తారీఖు వేయబడి ఉంది. దాన్ని చూస్తూ ఏదో ఆలోచనలో మునిగిపోయాడు రాఘవులు.

*　　　*　　　*

రాత్రి పదిగంటలు దాటితే ప్లీడరు రాజశేఖరం గారింట్లో పిట్టా - పురుగు కూడా మేలుకుని ఉండటానికి వీలు లేదు. ఇది ఆయన కఠిన శాసనం. వంటింట్లో కాపురముండే వంటావిడ దగ్గర్నుంచీ, పెరట్లో ఓ మూల కాపురముండే తోటమాలివరకూ అందరూ ఈ శాసనానికి బద్ధులైనవారే. ఇక ఆయన సంతానం—నలుగురి పిల్లలసంగతీ చెప్పనక్కర్లేదు. ఎంత పరీక్ష రోజులైనాసరే, ఎంత చదువుకోవలసిన అవసరం ఉన్నాసరే—ఆసమయందాటి మేలుకొని ఉండరు. అందుకనే రాత్రి పదిగంటలు కాగానే ఆ భవంతిలోని అన్ని గదుల్లోని లైట్లు ఆర్పివేయబడతాయి. అలాంటిది ఈ రోజు ఆ ఇంటి రెండవ అంతస్తులోని ఓ మూలగదిలో లైటు వెలుగుతూ ఉంది—రాత్రి పదకొండు గంటలు కావస్తున్నా కూడా!

రాజశేఖరం గదిలో పట్టెమంచం మీదపడుకుని ఏదో ఆలోచిస్తున్నాడు. మంచానికి ప్రక్కనే కుర్చీలో ఆయన భార్య కాంతం కూర్చుని ఉంది.

చేతిలో వుత్తరాన్ని అటూ యిటూ త్రిప్పుతూ భర్త కళ్ళల్లోకి చూస్తూ అందామె, "అయితే యీ సంబంధమూ తప్పిపోయినట్లేనన్న మాట. అమ్మాయిని ఎంతమంది వచ్చి చూసి వెళ్తున్నా, ఒక్క సంబంధమూ కుదరకపోవటానికి మీ వాళ్ళ ప్రవర్తనే ముఖ్యకారణం. ప్రతివాళ్ళూ మొరికనే ఎంచుతుండిరి. లేకపోతే మనకామేశ్వరికేం తక్కువ. చదువు, అందం అన్నీ వుండికూడా దాని ఖర్మ లా కాలింది. ఇక ఈ జన్మలో దానికి పెళ్ళవుతుందనే ఆశ నాకేమీ కనపడటం లేదు."

రాజశేఖరం ఆమెవైపు సాలోచనగా చూశాడు. భార్య మాటలు ఆయన మనస్సుకు కష్టం కలిగించినై. దీర్ఘంగా నిట్టూర్చి అన్నాడు. "గతించిపోయిన సంఘటనలకు ప్రాముఖ్యాన్నిచ్చి, రంధ్రాన్వేషణ చేసి తప్పులెన్నాలనుకుంటే ఎవరిలోనైనా దొరుకుతాయ్. అంతా మనుషులమేగాని దేవుళ్ళం కాముగదా. అలా జరగాలని రాసిపెట్టి వుంది, జరిగిపోయినై. అందుకే ఒక్క విషయానికి నాకు విచారంగా వుంది. ఈ రోజుల్లో కూడా పూర్వంలోలా యివన్నీ చూస్తున్నారంటే మనమెంత అభివృద్ధి చెందామో అర్థమవుతుంది."

"సరేలెండి. మీరనేది మరీబాగుంది. మనవాళ్ళు బుద్ధులలా తగలడటంలో తప్పులేదుకానీ, ఊళ్ళోవాళ్ళు వాటిని ద్వేషిస్తున్నారంటే విచారమెందుకు? పోయేవాళ్ళు పోక యీ అప్రతిష్ఠలన్నీ మన నెత్తిన పడేసిపోయారు." కాంతం కొంచెం తీవ్ర స్వరంలో విసుగ్గా అంది.

రాజశేఖరం ఏమీ మాట్లాడలేకపోయాడు. అతని హృదయంలో సంచలనం రేగింది. గత జీవిత విషాదరేఖలు అతని కళ్ళకు గోచరించినై. తండ్రి, పినతల్లి చేసిన నేరాలు తమ జీవితాలమీద ఎలాంటి చెరగని ముద్రవేసిందీ, అవగతమై మనస్సు బాధపడింది. కామేశ్వరికి పెళ్ళికి ఆర్థికపు టిబ్బందులుగాని, ఆమె అందచందాలుగానీ ఏవీ ఆటంకం కావటం లేదు. వున్న పెద్ద అవరోధం ఇదొక్కటే—తమ వంశం మంచిది కాదనేది!

ఆ విషయంలో తామెంత మెలుకువగా వ్యవహరిస్తున్నా అది బయటికి పొక్కుతూనే వుంది. వచ్చిన వాళ్ళంతా ఆ వంక చూసి వెళుతూనే వున్నారు. రాజశేఖరంకు భార్య మాటలే నిజమౌతాయేమోననే భయం కలిగింది. నిజంగానే కామేశ్వరి కీ జన్మలో పెళ్ళికాదేమోననే సందేహం మొట్టమొదటిసారిగా ఆయన మనస్సులో ప్రవేశించింది. ఈసమస్యను పరిష్కరించటానికి ఏదారీ తోచటం లేదు.

నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ అంది కాంతం, "వున్న దుండగా వుపాకర్మ అన్నట్లు, అజ్ఞాతంగా వుంటేనే యిట్లా వుండి దరీదారీ తోచక చస్తుంటే, రేపు మీ నాన్నగారు బయటికొస్తారు. గుర్తుందిగా. ఇహ, మనమ్మాయి పెళ్ళి మాటల్లో తప్ప చేతల్లో జరగదు"

రాజశేఖరానికి రేపటి రోజు ప్రాముఖ్యత గుర్తు కొచ్చింది. రేపు తన తండ్రి విడుదలై బహిః ప్రపంచంలోకి వస్తాడు. సరాసరి తనవద్దకే వస్తే—......

రాజశేఖరం కలవరపడ్డాడు. కాంతం చెప్పినట్లు నేరస్థులు కనపడనప్పుడే తమను వ్రేలెట్టి చూపి పరిహసిస్తున్న సంఘం—ఆ నేరస్థులు ప్రత్యక్షంగా కనపడుతుంటే సహించదు. బహిరంగంగా విమర్శిస్తుంది. అపహాసిస్తుంది. అంతే కాదు, తమనుంచీ బహిష్కరించవచ్చు.

'అబ్బ.' రాజశేఖరం రెండు చేతుల్తో తల పట్టుకుని వెనక్కు వాలిపోయాడు.

కాంతం, భర్తను చూసి కలవరపడింది. ఆయన ప్రక్కన కూర్చుంటూ చెప్పింది. "ఎంత తల బ్రద్దలు కొట్టుకుని మాత్రం ప్రయోజన మేమిటి? జరిగిందేదో జరిగింది. కానీ, రేపు ప్రొద్దున్నే ఆయనగార్ని ఇక్కడికి తోలుకు రాకండి. చేచేతులా ఈమాత్రపు ప్రశాంతినికూడా లేకుండా చేసుకోకండి. ఏంవంటారు?"

రాజశేఖరం సమాధానం చెప్పలేకపోయాడు. భార్య ఆలోచనని గర్హించాలో, ఆమె ముందు చూపుకు గర్వించాలో తెలియలేదాయనకు. భార్య కళ్ళల్లోకి చూస్తూ ఉండిపోయాడు.

* * *

ఠాణాలో పన్నెండు గంటలు కొట్టారు.

ఉసూరుమంటూ కంబళిమీద అప్పటి వరకూ పొర్లాడిన శంకరయ్య లేచి కూర్చున్నాడు. పున్నమిచంద్రుని కాంతి కిరణాలు వెంటిలేటరుగుండా గదిలో ఓమూల పరుచుకున్నై. విషాదావృతమైన శంకరయ్య హృదయంలో ఓ మూల వెలుగు విరిసింది. గదిలోని వెలుగు చీకట్లతో పోటీ

చేస్తూ శంకరయ్య మనస్సులో సంతోష విషాదాల సంచ
లనం రేగింది.

ఇరవై సంవత్సరాలు!

అనంతమైన కాల ప్రవాహంలో ఇరవైఏళ్ళు తృణ
కణాలు కావచ్చునేమో కాని, అరవై అయిదేళ్ళ తన జీవి
తంలో అవి మరపురాని మహత్తర సంవత్సరాలు. గడిచిన
ఇరవై ఏళ్ళనుంచీ చీకటికొట్లో బందీగా గడచింది తన
జీవితం.

పచ్చని చేలు—పండు వెన్నెల, ప్రాణికోటి—
ప్రకృతి సౌందర్యాలను చూసి పులకించే తరుణం మళ్ళీ
ఇంతకాలానికి లభించింది. ! బహిః ప్రపంచంలో, స్వేచ్ఛా
వాతావరణంలో పక్షిగా విహరించే మహద్భాగ్యం మళ్ళీ
తన బ్రతుక్కు లేదనే తలచాడు తను. కాని—భగవంతుడు
తాను నిర్దయామయుడిని కానని ఋజువు చేసుకున్నాడు!
తనకు వెలుగు చూపబోతున్నాడు.

ఆనందం ముప్పిరిగొని ఉప్పొంగిపోతున్న శంకరయ్య
హృదయం అంతలోనే క్రుంగింది. నేరస్థుడిగా లోకానికి
గోసి కఠిన నరకానికి గురిచేయబడిన తను బయటికి పోయి
సాధించే దేమిటనే ప్రశ్న ఎదురైంది. అవును. తాను
పొందబోయే సౌఖ్యం కాని, లాభం కాని ఏమిటి? అయిన
వారికి కాని, పరాయివాళ్ళకు కాని తా నెలా ఉపయోగపడ
గలడు?—లేనప్పుడు వారికి భారమే గదా?

అయినవారి ఆలోచన రాగానే శంకరయ్య మనస్సు

గతంలోకి గెంతింది. కళ్లు మూసుకుని మళ్ళీ నేలమీదికి ఒరిగాడు.

పదేళ్లపాటు కాపురంచేసి, ఎనిమిదేళ్ళ పిల్లవాడ్ని పెంచి పెద్దచేసి భారాన్ని తన భుజస్కంధాలమోపి, కామేశ్వరి హఠాత్తుగా యీ లోకాన్ని వీడిననాడు తన హృదయ వీణా తంత్రులు పెటపెటమని తెగిపోయినై. ప్రపంచమంతా చీకటి మయంగానే కనిపించింది. 'అమ్మేది నాన్నా' అని తల్లడిల్లిపోయే శేఖరాన్ని సముదాయించ లేక గుండెలు పిండి నట్లయ్యేది తనకు. స్కూల్లో కో టీచర్స్ బలవంతంవల్లనై తేనేమి, ఊళ్ళో శ్రేయోభిలాషుల సలహాలకు లొంగయి తే నేమి తాను సుమతిని పెళ్ళాడాడు. ఆమె తన హృదయ వీణాతంత్రుల్ని సరిచేసి, బిగించి, పూర్వవీణాగానా న్నాలపించి తనను మధురగాన ఝరిలో ముంచి తేలుస్తుందని ఎన్నెన్నో ఊహించాడు. కాని, ఆశాభంగమే లభించింది తనకు.

ఆరోజు—

సుమతికి ప్రథమ సమాగమం !—

కాలి అందెల రవళికి, దినపత్రికను మూసి తలెత్తి చూశాడు తను.

అదే సందడి !—కామేశ్వరి కంకణ నిక్వాణానికీ, సుమతి మంజీర శింజితానికీ భేదం గోచరించ లేదు తనకు. అయినా తా నావేళ సుమతిచే సమ్మోహితుడు కాలేక పోయాడు.

కారణం?—తనకది ప్రథమ సమాగమం కాకపోవటం.

మనస్సును కాదని ఎంత మరలించినా, కామేశ్వరితో తన సాహచర్య మధురోహల్ని తన కళ్ళముందు నుంచి పార ద్రోలలేకపోయాడు. 'పోనీ సుమతి అందచందాలైనా తన మనస్సును తట్టి లేపేయా' అంటే అదీ లేదు. సుమతి అంతటి భాగ్యశాలీ కాదు. అలాగని అనాకారీ కాదు. అసలు జీవితంలో ఏ అనుభూతి అయినా పునరావృత్తమైతే తొలిసారి కలిగే హృదయస్పందన కాని, పొందే ఆనందపు పొంగు కాని మలిసారి లభించదు.

పర్యవసానం ?—సుమతి కన్నీళ్లు.

తన ప్రవర్తన వలన ఆమెకు తానంటే ఒక విధమైన అలక్ష్యం ప్రబలింది. మాటల్లో చేతల్లో ఈసడింపు గోచరించేది.

ఋతువుల్లో వసంతం, వసంతంలో మధుమాసం, మధుమాసంలో పున్నమిరేయి, పున్నమిరేయిని ఆమని కోయిల గానం—ఆ ఆహ్లాదకర వాతావరణంలో ప్రియా సమాగమ లబ్ధమైన సమ్మోదం, కలకాలం కాంతల మనసుల్ని కరగించే యిలాంటి వేడుకను సుమతికి తాను తీర్చలేకపోయాడు. ఇప్పుడనిపిస్తున్నది, తా నామె కా విధంగా అన్యాయమే చేశానని. ఎంతసేపటికీ శేఖరం భవిష్యత్తుమీద నిమగ్నమై ఉండేది తన మనస్సు. సుమతికి తన భవిష్యజ్జీవితాన్ని గురించిన ఆరాటం ప్రబలిపోతూ ఉండేది. దాన్ని తాను గమనించి కూడా నిర్లక్ష్యం చేశాడు. తన నిర్లక్ష్యానికి ప్రోద్బలమైన మరో కారణం, రఘు జననం. సుమతి కడుపు పండి బిడ్డడిని కనటమే ఆమె జీవితానికి మహద్భా

గ్యంగా తలచేడు తను. కాని, సుమతి మనస్సు కేవలం మాతృత్వాన్ని పొందటంతో తృప్తిపడలేదు. తన వయసును తరింపచేసుకుని, గుండెల్లో ఆనందం పండించుకోవాలనే కాంక్ష ఆమె కుండేది.

ఈవిధంగా కొన్ని రోజులు గడచినై.

తానంటే ఈసడింపే కాకుండా, శేఖరమంటే ఈర్ష్య కూడా ఆమెలో విజృంభించింది. చీటికి మాటికి తిడుతూనో, కొడుతూనో వాణ్ణి వేధించసాగింది. వస్తుతహా మెతక స్వభావం కలిగిన శేఖరం సవతి తల్లి పెట్టే బాధల్ని వేటినీ తన దాకా చేరవేయకపోయినా, శేఖరమంటే సుమతి చూపుతున్న సవతితల్లి ప్రేమను తాను గమనించకపోలేదు. గమనించినా, పైకి ఆమె నేమీ అనగలిగేవాడు కాదు.

చుట్టపు చూపుగా వచ్చిన శేఖరం అమ్మమ్మ, వాడి పట్ల సుమతి ప్రవర్తనను కళ్లారా చూసి వాణ్ణి తనతో తీసుకు పోతానంది. తానూ అదే మంచిదని భావించాడు. సుమతి 'వాడికి నే నిక్కడేం తక్కువ చేస్తున్నా' నని మొదట్లో కొంచెం రాద్ధాంతం చేసినా వాణ్ణి పంపటానికి సుముఖతచూపింది.

శేఖరం మేనమామ ఇంటికి వెళ్ళిపోయాడు. వాడికంటే తనకు బెంగ ఎక్కువైంది. కాని, ఆ బెంగ ఎంతో కాలం నిలవలేదు కాలక్రమేణా శేఖరానికి మేనమామ చదువు సంధ్యలు నేర్పటం, పద్దెనిమిదో ఏట తన కూతుర్నిచ్చి పెళ్ళి చేయటం జరిగిపోయినై. శేఖరం వెళ్ళిన తర్వాత సుమతి ప్రవర్తనలో యింకా మార్పు వచ్చింది

ఠాణాలో ఒక గంట కొట్టారు. శంకరయ్య కళ్ళు నులుముకున్నాడు. కళ్ళు మండుతూ నీళ్లు కారుతున్నై. ప్రక్క కొట్లో ఖైదీ పిచ్చి ముసలయ్య ఏవో అరుస్తున్నాడు. బూతులు తిడుతున్నాడు ఎవర్నో. అతనూ తనలాగా 'దగా పడిన తమ్ముడే,' హత్యా నేరానికి శిక్ష ననుభవిస్తున్నాడు. ఏందువిటో ఈ జీవిత మనిపించింది శంకరయ్యకు. 'మిథ్య' అని సమాధానం చెప్పుకునేసరికి సన్నగా నవ్వొచ్చింది. నేరస్థునిలో పశ్చాత్తాపం, మానసిక పరివర్తన—ఈ రెండూ జైలుశిక్ష విధించటంలో అధికారి ఆశించే పరిణామాలు. కాని, ఎందరిలో ఈ మార్పు కలుగుతోంది?—ఏమో?

శంకరయ్యకు నిద్ర రావటంలేదు. పూర్వాశ్రమం లోని తన జీవితమంతా నెమరుకువచ్చి మనసును కలత పరుస్తుంటే నిద్రేం పడుతుంది?—ప్రక్కకు తిరిగేడు. జైలు గోడమీద పాతబడిన చలనచిత్రం మసక మసకగా కనపడ సాగింది.

క్లాసులో పాఠం పూర్తిచేసుకుని టీచర్సు రూమ్‌లోకి వచ్చాడు తను. గది ద్వారం దగ్గరికి చేరేసరికి తనను గురించిన సంభాషణ వినపడి అలాగే నిలబడిపోయాడు. కృష్ణ మూర్తి—రామ్మూర్తి సన్నగా మాట్లాడుకుంటున్నారు.

"శంకరయ్యగారి పెళ్ళాం పెద్ద నాయకురాలైందిట గదండీ?"—!!

తన కడుపులో దేవినట్లయింది

"ఆఁ...కాక ఏం చేస్తుందండీ. ఈయ నొక పెద్ద విశాల హృదయుడు. ఆమెకు కావలసిన స్వేచ్ఛ నిచ్చాడు

కాని, ఆనందాన్నివ్వలేదు. దాన్ని పొందే మార్గాన్ని తెలుసుకుందావిడ. అంతే."

తన హృదయం వ్రయ్యలైంది. మండే గుండెలో కొంపకు చేరాడు. సుమతిని రకరకాల ప్రశ్నలు వేశాడు. ఆమెమీద అనుమానపు దృక్కులను బరపాడు. తన హృదయంలోని బాధనంతాత్రవ్వి ఆమెముందు కుప్పగాపోశాడు.

సుమతి కళవళపడింది. ఏమీ సమాధానం చెప్పలేక పోయింది. దెబ్బ తిన్నదానిలా అయిపోయి అంతలోనే తేరుకుంది. పాడినవ్వు నవ్వి తన దగ్గర చేరింది. చుబుకాన్నెత్తి, తన కళ్ళల్లో కళ్ళు పెట్టి "మీ రెంత అమాయకులండీ. ఎందు కంత తికమక పడతార" ని ప్రశ్నించింది.

తా నేమీ చేయలేకపోయాడు. ఆమె చంచల నేత్రాల్లో చంచలత్వాన్ని చపలత్వాన్నీ పసికట్టలేకపోయాడు. కాగా, రగిలిపోతున్న తన హృదయానికి అమృతపు చిలకరింపులైనాయామె పలుకులు. ఏమైనా తనలో అనుమాన బీజాలు నాటుకున్నాయి. మనస్సులో ఆరాటం మొదలైంది. ఎవరితో కలిసి తిరుగుదామన్నా ఏదో లజ్జ ముంచుకొచ్చేది. తన నెవరు చూస్తున్నా ఏదో చులకనచూపు చూస్తున్నా రని పిస్తూ ఉండేది. ఇద్దరం కలిసి మాట్లాడుకుంటూంటే తనను గురించేనన్నే భావన కలుగుతూ ఉండేది. ఆవిధంగా తనకు తానుగా పదిమందికీ దూరమై పోయాడు.

ఒకసారి తా నేదో పనిమీద పట్నానికి పోయి, మర్నాడు ఊరుకు చేరుకునేసరికి ఊరు ఊరంతా గుప్పుమంది. ఇద్దరు వ్యక్తులు కలిసినచోటల్లా సుమతి మాట వినపడింది. ఏటి ఒడ్డున అమ్మలక్కల దగ్గర్నుంచీ, తన యింటి

ప్రక్క చిల్లరకొట్టు, శేషావతారం వరకూ—అంతా ఇదే విషయాన్ని ఓలవలు పలవలుగా చెప్పుకొని ఆనందిస్తున్నారు. తనను చూసి వచ్చే నవ్వును ఆపుకుంటూ బాధపడ్డారు.

తల కొట్టేసినట్లయింది తనకు. ఇంటికిపోయి కోపంతో సుమతిని నానా హింస పెట్టాడు. కాని, సుమతి తాను నిర్దోషినని వగలుపోయింది. నిజా నిజాల్ని తా నెంతగానో ఆలోచించి చివరికి నిప్పులేని పొగ రాజుకోదనే నిశ్చయాని కొచ్చాడు.

ఆనాటినుంచీ తన జీవితం నిప్పులు చెరిగింది. ఇల్లొక నరకకూపంగా మారిపోయింది. సుమతికీ, తనకూ మాటా మంతీ లేకుండా పోయాయి.

ఒకరోజున టీచర్సు రూములో తా నేదో ఆలోచించు కుంటూ కూర్చున్నాడు. హిందీ మాష్టరు పూర్ణానందం మాసపత్రిక నొకదాన్ని తెచ్చి "ఈ కథ చాలా గొప్పగా ఉందండీ. చదవడం" టూ పుస్తకాన్ని తనచేతి కిచ్చాడు. ఆయనంటే తనకుగల సదభిప్రాయం తానా కథను చదివే టట్లు చేసింది.

తీరా చదివితే – ఆ కథకూ తన జీవితానికీ పోలికలు గోచరించినై. అందులోని పాత్రలు, వాటి మన స్తత్వాలు తమ కన్వయించుకుంటే అతికినట్లు సరిపోయినై.

అందులో ఒక భర్త అసమర్థత కారణంగా భార్య పతితగా మారుతుంది. ఆమె చాలా విద్యా సంపన్నురాలు. కవయిత్రి. సంఘంలో మంచి గౌరవస్థానంలో ఉండి కూడా సమాజంలో విచ్చలవిడిగా సంచరిస్తూ ఉంటుంది. ఆమె

నైచ్యాన్ని చూస్తూచూస్తూ కూడా సహించి వూరుకుంటాడు భర్త. పైగా ఆమె ప్రవర్తనను తనలో తానుగా సమర్థించుకుంటాడు. కాని, లోలోపల కృశించిపోతూ ఉంటాడు. ఆ బాధతో క్రుంగి రోగంతో తీసుకుపోతాడు.

హృదయాన్ని కదలించే కథ. కాని, భర్త పాత్ర పోషణలో అవా స్తవికత చోటు చేసుకుందనిపించింది తనకు. ఏ భర్తా అంతటి సాహసశీలిగా ఉండలేడని భావించాడు.

పూర్ణానందం ఆ కథను చదవమని తన కెందు కిచ్చాడో అర్థమైంది తనకు. ఇలాంటి హేళనల కెన్నింటికో తన కడుపు రగిలిపోయింది.

సుమతి చరిత్రలో తర్వాత అధ్యాయం క్రొత్త పరిణామాన్ని తెచ్చిపెట్టింది. ఊళ్ళో కొందరి పేర్లతో 'సుమతి' పేరు జతచేయబడింది. టైలరు వీరాస్వామి, మునసబు కొడుకు గోపయ్య పేర్లు అలాంటి వాటిలో కొన్ని. తనకు జీవితమంటేనే రోత పుట్టింది. ఆ విషపూరితవాతావరణంలో, ఆ నరకంలో బ్రతకలేననిపించింది. మనుష్య సంచారంలేని ఏ సుదూర తీరాలకో పారిపోవాలనిపించేది. కాని, సుమతి జాలిచూపుల కన్నీటిధారలు తన ముందరి కాళ్ళకు బందం వేసినై. ఆమె అమాయకంగా చూస్తూ "దేవుడులాంటి మీకు అబద్ధం చెప్తానా?" అంటే నీళ్లు కారేవాడు తను. అంతలోనే లోకుల మాటలకు బాధతో హృదయం కలత చెందేది. కామేశ్వరి సుగుణ సంపదను, ఆమెతో తాను గడిపిన మధుర క్షణాల్ని గుర్తు చేసుకుని, వాటినిసుమతితో పోల్చుకుని మనస్సు వ్యథ చెందేది. హృదయంలో బడబాగ్నుల్ని, అగ్ని పర్వతాల్ని దాచుకొని రోజులు వెళ్ళ

బుచ్చాడు. ఆ బడబాగ్నులు భయంకరంగా ఎగసి, ఆ విష జ్వాలలు తనను దహించివేసిన రోజు, ఆ అగ్నిపర్వతాలు బ్రద్దలై తనను తుత్తునియలు చేసిన దుర్దినం—అదే ఆరోజు!—

ఠాణాలో మూడు గంటలు మ్రోగినై. శంకరయ్య గుండెలమీద సమ్మెటపోటు లైనాయా గంటలు.

ఆరోజున తానెలా మరువగలడు?

స్కూల్లో మీటింగుకు హాజరై, బజారుపని చూసుకుని తాను ఇంటికి చేరేసరికి రాత్రి తొమ్మిది గంటలైంది. పరధ్యానంగా తలుపు తట్టబోయిన తను లోపలి గుసగుసల్ని విని ఆ ప్రయత్నం నుంచీ ఆగాడు. లోపల ఏవో కిలకిలలు, పకపకలు!—

క్షణంలో సగకాలం, ఒక లిప్తలో సహస్రాంశం సేపు గుండె కొట్టుకోవటం మానేసింది. కాలు వెనుకడుగు వేసింది. కాని, అప్రయత్నంగా తలుపును దడదడ లాడించింది తన చెయ్యి. లోపలి వ్యక్తులు తికమక పడ్డారు. కలవరంతో తలుపు తీసిన సుమతి తనను చూసి దిగ్భ్రమ చెందింది. నేరస్థురాలిలా కంపించిపోయింది. ఈ హఠాత్సంఘటనకు తప్పుకుపోయే మార్గం లేక బిత్తరిచూపులు చూస్తూ గదిలో ఓ మూల ముడుచుకు నిలబడ్డాడు — ట్రైలర్ వీరాస్వామి!

అసంభవమూ, ఊహాతీతమూ అనుకున్న సంఘటన సంభవిస్తే కలిగే ఆశ్చర్యం, ఆవేశంకూడా ఊహాతీతంగానే ఉంటాయి. తన పెదవులు బిగపడి పళ్లు పటపటలాడినై. కళ్లు నిప్పులు క్రక్కినై. బరితెగించిపోయిన కాముకుల్ని చూసి తనకేదో పిచ్చి ఆవేశం ఆవరించింది. టేబుల్‌మీద ఉన్న

రూలర్‌ని తీసుకుని 'ఛా' అంటూ ఒకేఒక్క వేటు...!

"అబ్బా" అంటూ కూలిపోయాడు వీరాస్వామి. తాను భయంతో నిలువెల్ల వణికిపోయాడు. ఈగందరగోళా నికి నలుగురూ చేరారు. తనకు కళ్లు తిరిగినట్లు కావటం, తల పట్టుకు క్రింద కూలిపోవటం వరకే తనకు తెలుసు.

స్పృహ వచ్చి చూసేసరికి పోలీసుల ఎదుట పడు న్నాడు తను. తాను వేసిన రూలర్ తగలరాని చోట తగిలి వీరాస్వామి మరణించాడని తర్వాత తెలిసింది. తాను హంతకుడుగా నిరూపింపబడ్డాడు. యావజ్జీవ కారాగారశిక్ష విధించారు తనకు.

చివరిసారితననుచూస్తూ గుడ్లనీరు గుడ్లకుక్కుకుందిసుమతి. తన కామెవైపు చూడటానికి అసహ్యం వేసింది. 'నాన్నా —నాన్నా' అంటూ రోదించాడు రఘు. వాణ్ణి చూసి తన కడుపు తరుక్కుపోయింది. శేఖరం కాంతంతో సహా తనను చూడటానికి వచ్చాడు. శేఖరం కళ్ళల్లో తా నా నాడు ఎన్నెన్నో చదివాడు. తను రెండో పెళ్ళి చేసుకొన్నందుకే వాడికి కొంత బాధ ఉన్నట్లు తెలుసు తనకు. అలాంటిది పినతల్లి ఇంత నీచానికి ఒడిగట్టటం, తండ్రి ఒక హంత కుడుగా మారటం శేఖరం మనస్సును కలచివేసి ఉంటాయి. అందుకనీ అతనిలో తానంటే ఏదో ఏహ్యభావం గోచరిం చింది. కడసారి తనను పలకరిస్తూ అదే అన్నాడు. "ఎలాంటి వాళ్ళం చివరికి ఎంత దుస్థితికి దిగజారేం, నాన్నా" అంటూ కళ్లనీళ్ళు పెట్టుకున్న శేఖరం తన కళ్ళముందు నిలుస్తు న్నాడు. ఏమైనా తానంటే అసహ్యమే వాడికి. ఆ విధంగా చీకట్లోకి వచ్చేశాడు తను, చిత్రం ముగిసింది.

గాలికి ఎగిరివచ్చి తన ప్రక్కన పడిన జీర్ణపుటాన్ని చదివినట్లయింది శంకరయ్యకు. తన జీవన గ్రంథంలో నలిగిన పేజీ అది.

ఠాణాలో గంటలు మ్రోగుతున్నై. ఖైదీలు విశ్రాంతి చాలించే వేళయింది. జైలు వరండాల్లో కాపుదార్ల కేకలు ప్రతిధ్వనిస్తున్నాయి.

శేఖరానికి తనమీది ఏహ్యభావం ఇప్పుడు మాసిపోయిందో లేదో మరి? రఘు ఎంతవాడైనాడో? ఏం చేస్తున్నాడో? ఈ రోజు శేఖరం, రఘు—ఇద్దరూ తననుతీసుకుపోవటానికి వస్తారు కాబోలు. సుమతి ఏమైందో?

శంకరయ్య ఆలోచించలేకపోయాడు. బరువుగా కళ్ళు మూసుకున్నాడు. నులివేడి కన్నీరు కణతల్ని తడిపింది. చేతి చూపుడు వ్రేలితో అశ్రుకణాల్ని తుడుచుకుంటూ లేచి కూర్చున్నాడు. ఒళ్ళంతా విరకొట్టినట్లుంది. ఏదో బధకం దాన్ని పారద్రోలుతూ ఏదో ఉత్సాహం. ఆ ఉత్సాహాన్ని వెలుపలికి రానీకుండా భయం. ఆ భయాన్ని పెరుగనీయని నిర్లిప్తత. అనేక రకాలైన శారీరక, మానసికావస్థలకు లోనై ఊగిపోయాడు శంకరయ్య.

ఖైదీల కోలాహలం హెచ్చింది.

శంకరయ్య లేచి తలుపుదాకా వచ్చాడు. ఊచల్ని పట్టుకుని బయటికి చూడసాగేడు.

కొద్ది సేపటికి ఎవరో వచ్చారు. తలుపుతీసి తమవెంట జైలు సూపర్నెంటు దగ్గరకు తీసుకుపోయారు.

శంకరయ్య దుస్తులు ఆయనకిచ్చి హితబోధచేశారు సూపర్నెంటు. పరితప్త హృదయంతో నూతన జీవితాన్ని

ప్రారంభించి, జన్మ సార్థకం చేసుకోండి. తప్పుచేయటం మానవ సహజం. చేసినతప్పును తిరగిచేయటం రాక్షసత్వం. కనక మళ్ళీ ఏనేరానికి పూనుకోకండి."

శంకరయ్యఆయనకునమస్కరించిఇవతలకు నడిచాడు.

జైలు బయటికి రాగానే శంకరయ్యచూసిన వ్యక్తి —రిక్షా హేండిల్ మీద ఒరిగి ఆతృతగా గేటువైపు చూస్తున్న రాఘవులు.తన రఘు పోలికల్ని అతనిలో వెతుకుతున్నాడు శంకరయ్య.

నాలుగుకళ్లూ రెండయి ఆనందంతో మిలమిలలాడాయి.

'నాన్నా' అంటూ బావురుమని శంకరయ్య చేతుల్లో వాలిపోయాడు రాఘవులు. పుత్రగాత్ర పరిష్వంగ సుఖంలో పులకించిపోయింది శంకరయ్య హృదయం.

ఆనంద జలధినుంచి బయటపడిన శంకరయ్య చుట్టూ చూసి కొడుకును అడిగాడు "అన్నయ్య రాలేదురా రఘూ అని."

"ప్చ" అని పెదవి విరిచి, "ఇప్పుడు నాపేరు రాఘవులు నాన్నా" అన్నాడు రాఘవులు, ముందడుగు వేస్తూ.

శంకరయ్య అంతరంగం కలుక్కుమంది. దీర్ఘంగా నిట్టూర్చాడు. ఆయన కంఠంలో ఏదో కొట్టుకులాడింది.

"మీ అమ్మ..." అని ఏదో అడగబోయేడు గానీ, ఆయన గొంతుమూగవోయింది.

ఎదురుగా ఉన్న ఎత్తుపల్లాల రోడ్డు వారికి స్వాగతం పలికింది.